

కథా కౌముది

# నేనో నీచుడిని

గాదిరాజు మధుసూదన రాజు

ఉదయం లేవగానే గుడ్ మార్నింగ్ మేసేజ్ ఖచ్చితంగా పెడతాను.

రాత్రికి గుడ్ నైట్
మేసేజ్ ఖచ్చితంగా పెడతాను.

చిన్నచిన్న సందర్భాలకు కూడా
శుభాకాంక్షలంటూ

మేసేజ్ లు ఖచ్చితంగా పెడతాను

మీ ఇంట్లో
పుట్టినరోజు అంటే వచ్చి పాల్గొంటాను

ఫంక్షన్స్ ఉంటే
వచ్చి పాల్గొంటాను

నీవు ఇబ్బందుల్లో
వున్నావంటే
తప్పించుకుంటా

సాయం చేయడం నావల్ల కాదు

ఓదార్చే ధైర్యం లేదు ప్రయత్నం చేయలేను

ఆపదల సమయంలో
దరిచేరలేను

డబ్బు ఇవ్వలేను
కనీసం మాట సాయం చేయలేను

నేను వైభవంగా సుఖంగా
ఆనందంగా ఉన్నప్పుడు,
నా మనిషిగా నిన్ను
గౌరవించుకోలేను

ప్రేమగా పలకరించు కోలేను

నా జీవితం లో
నీవు నాపై చూపిన
ప్రేమ.. నా అమ్మను గుర్తుకు తెస్తుంది

నాకోసం నీవు పడ్డ కష్టం తలచుకుంటే
నా అమ్మే గుర్తుకు వస్తుంది

ఎత్తుకు తిరిగావు
నీకన్న బిడ్డ లా నన్ను
హత్తుకున్నావు

నా కోసం
త్యాగలెన్నో
చేశావు
కష్టాలెన్నో
భరించావు

నేను ఎదిగితే
అనందపడ్డావు

దిగులుపడితే
బాధ పడ్డావు

తప్పులెన్నో
క్షమించావు

ఇంకా నా మేలే
కోరుతూంటావు
ప్రేమ తో
దీవిస్తావు

అయినా...

నేనేమి
చేశాను నీకు

ప్రతిసారీ సారీ చెబుతాను

కారణాలు యేవేవో
నీ ముందు
నసుగుతూ నమ్మేలా  వినిపిస్తాను

“మనసుంటే మార్గం
ఉంటుంది కదా”
అనికూడా నీవు అనవు

“పాపం నిజమే చెపుతూన్నాడేమో”
అన్నీ ప్రేమతో క్షమిస్తావు
మళ్లీ మళ్లీ
దీవిస్తావు

అవి దైవ సాక్షిగా... నే ను చెప్పిన వన్నీ నిజాలో కావో మరి నాకే
తెలియదు

“నేనూ ఒక మనిషి నేనా?”
అని ఆలోచిస్తే
అది కూడా ముందసలు నాకే అర్థం కాదు

నీతో పాటు ఈ లోకం లో పుట్టాను కదూ
అందుకే నన్ను ' నీవు మనిషివి కాదు రా '
అనే ధైర్యం ఎవరికీ లేదు.

నీ ఔన్నత్యం తో నీవు
'దైవం మానుష రూపేణ సంస్థితా' అని పంచుకుంటూ నీవు మా పాలిటి దేవతగా మారావు

అది మాత్రం నిజం.

శుభాకాంక్షలు తెలపటం
క్షమాపణలు
అడగటం
అర్హత లున్నవాళ్ళే చేయాలి.
అవి నాకు లేవని తెలుసు.

అయినా వదలను

అందుబాటులో లేకుంటే......

“వాడు ఎక్కడ వున్నాడో ,ఏమో! నా గురించి తెలిసుంటే
నా దగ్గర లో
ఉంటే వాడు అలా..
నా పట్ల ఇలా నిర్లక్ష్యంగా ఉండేవాడు కాదు” అనుకుంటూ,
అంటూ తృప్తి పడి క్షమించే మనస్తత్వం ఉన్నది నీకు..
అది తేలిసీ..నీ దృష్టిలో ఉన్నాననిపించి...నీ మనసును కలచి వేయటం, కనిపించి నీ కళ్ళలో నాపై
ప్రేమతో పొంగే కన్నీళ్లను చూసుకోవటం , అదో క్రూరత్వమేనని నేను అనుకుంటా...
అయినా మనుకోను నేను.

ఆప్యాయతలు అనురాగాలు అనుబంధాల అల్లికల మధ్య స్వర్గతుల్యమైన లోగిలిలో నీవున్నావు.

నాగరిక కలికలుషపు గేటెడ్ కమ్యూనిటీ ల అట్రాసిటీ లో నేనున్నాను

నీ లోకానికి నేను రాలేను

నేనున్న చోటికి
నిన్ను రమ్మని పిలిచి,
నీ మనసుకు వెలితి వెతల వాటాలు నేనివ్వలేను

నే నో నీచుడిని
ఈ జన్మలో నేనో రుణ గ్రస్తుడిని

పుట్ట గతులుండకూడదని
మోక్షం ఆశించే
పేరాశ పోతుని!!

నన్ను క్షమించకక్కా
అది నేనసలు భరించ లేను

ఇట్లు
నీ తమ్ముడు

(ఓ ఎనభయి ఏళ్ళ ముసలి పల్లెటూరి అక్కకి .. ఓ అరవై యేండ్ల మెట్రోసిటీ తమ్ముడు తన మనసులో మౌనం గా వ్రాసుకున్న లేఖ)

COMMENTS